Eenadu

Dt 26/02/16.




# మెరుపు... మరపు!

- కీలక టెర్మినల్‌కు రైల్వే బడ్జెట్‌లో మోక్షం
- యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌కు పచ్చజెండా
- మౌలిక సదుపాయాల పట్ల చిన్నచూపు



ఈనాడు, హైదరాబాద్

కేంద్ర రైల్వే బడ్జెట్‌లో నగరానికి కొంత మోదం, మరికొంత ఖేదం మిగిలింది. అనేక ఏళ్లుగా ప్రతిపాదనలో ఉన్న రైల్వే టెర్మినల్ ఏర్పాటుకు ఈ బడ్జెట్‌లో ఆమోదం లభించింది. రెండో దశ ఎంఎంటీఎస్ రైల్వే లైను పూర్తి చేయడంతో పాటు మూడో దశ కింద యాదాద్రి వరకు రైల్వే లైను నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని రైల్వే మంత్రి సురేష్‌ప్రభు మన్నించారు. ఇదే సమయంలో నగరంలో ఉన్న ప్రధాన రైల్వే స్టేషన్లలో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. గత మూడు బడ్జెట్లలో నగరానికి కేటాయించిన కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టుల ప్రస్తావనను రైల్వే మంత్రి మరచిపోయారు.

- సికింద్రాబాద్ స్టేషన్‌పై విపరీతమైన ఒత్తిడి ఉండటంతో చర్లపల్లి దగ్గర టెర్మినల్‌కు నిధులిచ్చేందుకు రైల్వే మంత్రి ఆమోదముద్ర వేశారు. రూ.80 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.
- నాగులపల్లి స్టేషన్‌ను తొలుత ఆదర్శ స్టేషన్‌గా అభివృద్ధి చేస్తారు. ఆపై టెర్మినల్‌గా తీర్చిదిద్దుతారు.
- ఎంఎంటీఎస్ రెండో పనులను పూర్తి చేయడానికి ఈ బడ్జెట్‌లో రూ.45 కోట్ల మేర నిధులను కేటాయించనున్నారు. ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాది నాటికి పూర్తి కావాల్సి ఉంది. నిధుల కేటాయింపు వల్ల గడువులోగా ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవకాశం ఏర్పడింది.
- మూడో దశ కింద ఘట్‌కేసర్ నుంచి రాయగిరి (యాదాద్రి) వరకు లైనుకు రూ.330 కోట్ల మేర వ్యయం అవుతుందని అంచనా. ఈ లైనుకు ఆమోద ముద్ర వేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇటీవల రైల్వే మంత్రిని కోరారు. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో రెండింట మూడొంతులు (రూ.220 కోట్లు ) రాష్ట్ర ప్రభుత్వం, మిగిలింది రైల్వే శాఖ భరిస్తుంది. సికింద్రాబాద్ నుంచి ఘట్‌కేసర్ వరకు 21 కి.మీ. ఎంఎంటీఎస్ రెండో దశ పనులు జరుగుతున్నాయి. మరో 32 కి.మీ. పొడిగించడం ద్వారా యాదాద్రి వరకు రవాణా వ్యవస్థ మెరుగవుతుంది. అందుకోసం మూడో లైను నిర్మాణంతో పాటు అవసరమైన భూసేకరణ చేయాల్సి ఉంది. వచ్చే ఏడాదికైనా పనులు మొదలుపెట్టే అవకాశం ఉంది
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొత్తగా 4 లిఫ్టులు, 2 ఎస్కలేటర్లు మంజూరు చేశారు. వీటి ఏర్పాటుకు అంచనా వ్యయం రూ.2.98 కోట్లు కాగా తాజా బడ్జెట్‌లో రూ.కోటి విడుదల చేశారు.
- ప్రస్తుతం స్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు తగినన్ని నిధులు కేటాయించలేదు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ స్టేషన్‌గా మారుస్తామని మూడేళ్ల కిందట బడ్జెట్‌లో ప్రకటించారు. ఇంతవరకు ఆ ప్రక్రియ ముందుకు వెళ్లలేదు. నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లలో రద్దీకి అనుగుణంగా ప్లాట్‌ఫాంలను పెంచాలన్న డిమాండ్‌ను పట్టించుకోలేదు.

## ప్రతినిధులూ... పట్టు పట్టాలి

అంత్యోదయ, హమ్‌సఫర్, తేజస్, ఉదయ్ పేర్లతో సరికొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లను బడ్జెట్‌లో ప్రకటించారు. పదుల సంఖ్యలో ఈ రైళ్లను ప్రకటించే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. రాజధానికి చెందిన ఎంపీలు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తేనే వీటిని మన నగరానికి సాధించే వీలుంటుంది. ప్రస్తుతం ఇక్కడి నుంచి నడిచే అన్ని రైళ్లూ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. మన నగరం నుంచి షిర్డీకి, కాచిగూడ నుంచి బెంగుళూరుకు రైళ్ల సంఖ్యను పెంచాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వైష్ణోదేవి ఆలయ సందర్శన కోసం కాట్రా వరకు రైలు నడపాలన్న డిమాండ్ ఉంది. విశాఖపట్టణం వైపు మరో రెండు రైళ్లను వేయాలని అధికారులు ప్రతిపాదించారు.





## నెల రోజుల్లోనే ఆమోదం అరుదే

-ఎన్వీఎస్‌రెడ్డి, ఎండీ, మెట్రో రైలు ప్రాజెక్టు

"యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు ప్రతిపాదనను ఆమోదిస్తూ రైల్వే బడ్జెట్‌లో చేర్చడం శుభసూచకం. ప్రతిపాదించిన నెల రోజుల్లోనే ఆమోదించడం అరుదుగా జరుగుతుంటుంది. యాదాద్రికి వేగంగా చేరుకునే రవాణా వ్యవస్థ అందుబాటులో ఉండాలనేది సీఎం కేసీఆర్ ఆలోచన. ఆయన ఆదేశాలతో రైల్వే ఇంజినీరింగ్ బృందం కలిసి ప్రాథమికంగా ఈ మార్గంలో సర్వే చేశాం. రెండు వారాల్లోనే ప్రతిపాదనలు సిదమయ్యాయి. ఈ మార్గంలో కొత్తగా ఘట్‌కేసర్, భువనగిరి, పగిడిపల్లి, బీబీనగర్, రాయగిరి స్టేషన్లు ఉంటాయి"



ఎంఎంటీఎస్ మూడో దశకు ఆమోదం...
యాదగిరిగుట్టకు నేరుగా రైలు ప్రయాణ సౌకర్యం